
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

శనివారం 13 జనవరి 2024

5



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

సమస్యలపై ఏకరువు

- కార్యాలయంలో సరిపడ సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నామని వెల్లడి
- మానుకోట పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి : బీఆర్ఎస్
- ఎస్డీఎఫ్ రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి
- పట్టణాభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దాం : ఎమ్మెల్యే మురళీనాయక్

మునిసిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లిన సభ్యులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 12 : మానుకోట మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకమండలి సమావేశంలో కౌన్సిలర్లు సమస్యలపై ఏకరువు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక.. తొలిసారిగా నిర్వహించిన మునిసిపల్ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. మహబూబాబాద్ ఎమ్మెల్యేగా భూక్య మురళీనాయక్ గెలిచిన తర్వాత, జరిగిన ఈ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లు సమస్యలను వివరించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఫ్లోర్ లీడర్లు, కౌన్సిలర్లు మానుకోట పట్టణంలో నెలకొన్న సమస్యలను వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎస్డీఎఫ్ నిధులు రూ.50 కోట్లను మంజూరు చేయించి, తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్‌లో పనుల బిల్లులు..

మానుకోట మునిసిపల్ పాలకమండలి సమావేశంలో తొలుత చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి పలు అంశాలను ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సరిపడ ఉద్యోగులను నియమించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మునిసిపాలిటీలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. బస్టాండ్ సెంటర్ నుంచి ఈదులపూసపల్లి వరకు, నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వరక రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. అదే విధంగా ఆర్వోబీ, రింగ్ రోడ్డును సాధించే దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ పేదల ఇళ్లకు పట్టాలిచ్చి, ఇంటి నెంబర్లు కేటాయించాలని, జీవో నెంబరు 58 ద్వారా పట్టాలందించాలని కోరారు. మునిసిపాలిటీకి రావాల్సిన పట్టణ ప్రగతి నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, గత సంవత్సర కాలంగా రావడంలేదని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్ మాట్లాడుతూ నిజాం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గతంలో నిధులు మంజూరు అయ్యాయని, అయితే ఏ కారణం చేతనో గాని పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. గోపాలపురం రోడ్డును వెడల్పు చేయాలని కోరారు. కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎస్డీఎఫ్ నిధులు రూ.50 కోట్లు తీసుకువచ్చి అందులో మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలకు ఒక్కొక్కదానికి రూ.కోటి నిధులు కేటాయించాలన్నారు. సీపీఐ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో నెంబరు 122 ద్వారా తీసుకువచ్చిన నూతన మునిసిపల్ చట్టంతో కౌన్సిలర్లు ఉత్సవవిగ్రహాలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబరు 34 ద్వారా మాజీ సీఎం కేసీఆర్ ఎస్డీఎఫ్ నిధులు రూ.50 కోట్లు ప్రకటించి, మంజూరు ఇవ్వలేదన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జీవో నెంబరు 367 ద్వారా పలు వార్డుల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేసి, నేటికి విడుదల చేయలేదని ఈ మూడు జీవో ప్రతులను చించి వేశారు. తన వార్డు పరిధిలోని మూడుకొట్ల జంక్షన్ అభివృద్ధిలో నిర్లక్ష్యం చూపారని ఆయన మండిపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు



మానుకోట మునిసిపల్ పాలకమండలి సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

బీఆర్ఎస్ కౌన్సిలర్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ గ్రీన్‌ల్యాండ్‌లు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎడ్ల వేణు మాట్లాడుతూ పేదల గుడిసెలను కూల్చిన అధికారులు బడాబాబులు ఆక్రమించిన ప్రభుత్వ భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి, వెంచర్లు చేసి, ప్లాట్లుగా విక్రయిస్తున్న నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ హరిసింగ్ మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి పట్టణాభివృద్ధి కోసం నివేదికలు తయారు చేయాలన్నారు. మునిసిపల్ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ సమస్యలపై దృష్టి సారించి, పరిష్కారానికి కృషి చేస్తా మన్నారు. పట్టణంలో అన్ని సైట్‌లను సందర్శించి, ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాటు పడుతామన్నారు. సర్కార్ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఏజెండాలోని పలు అంశాలపై చర్చించి తీర్మా నించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నారాణి, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, టీపీవో నవీన్‌కుమార్, మెప్మా డీఎంసీ విజయ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేద్దాం..

- ఎమ్మెల్యే మురళీనాయక్

మానుకోట పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, రాజకీయాల కతీతంగా కలిసికట్టుగా పని చేద్దామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. ప్రతీనెల మునిసిపల్ పాలకమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఏప్పటికప్పుడు సమస్యలపై చర్చించి పరిష్కారం చూపుదామన్నారు. ఆర్వోబీ మంజూరు విషయంలో ఆర్‌అండ్‌బీ మంత్రి వెంకట్‌రెడ్డితో మాట్లాడి సమస్యను వివరించానని తెలిపారు. కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువులకు హద్దులు నిర్ణయించి సుందరీకరణగా తీర్చిదిద్దుదామన్నారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా డీపీఆర్‌ను తయారు చేయాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల సిబ్బందికి కేటాయించబోయే విధులను నిర్వర్తించేందుకు అధికారులు అవగాహన పొందాలన్నారు. ఎన్నికలను నిర్వహించే పోలింగ్ సిబ్బంది సీపీవో, ఈవీఎంల నిర్వహణ అదనపు కలెక్టర్, ఈవీఎంల అవగాహన కార్యక్రమాలను డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య చేపట్టాలన్నారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు చేపట్టబోయే శిక్షణను ఉద్యానవన అధికారి సూర్యనారాయణకు కేటాయించాలని సూచించారు. అలాగే ఎన్నికల వ్యయ ఖర్చులను జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ నిర్వహించాలన్నారు. గతంలో శాసనసభ ఎన్నికలను నిర్వహించిన విధంగానే అధికారులు పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, పీడబ్ల్యూడీ హోమ్ ఓటింగ్‌ను పటిష్టంగా చేపట్టాలన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ పురస్కరించుకుని 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పిస్తూ మృతి చెందిన ఓటర్లను కూడా తొలగించేందుకు ఆధారాలను సేకరించి, చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, మాస్టర్ ట్రైనీలు ప్రవీణ్, రాములు. ఎన్నికల విభాగం తహసీల్దార్ పవన్, రమణి, రంజిత్, సందీప్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు వేగవంతంగా చేపట్టాలి..

మెడికల్ కళాశాల పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో రోడ్లు, భవనాలశాఖ అధికారులతో మెడికల్ కళాశాల, కలెక్టర్ క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.510 కోట్లతో 30 ఎకరాల్లో చేపట్టిన మెడి కల్ కళాశాల పనులు వేగవంతం చేయాలన్నారు. మెడికల్ కళాశాలతో పాటు బాలుర, బాలికల వసతి గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో చేపట్టబోయే వాకింగ్‌ట్రాక్, గార్డెన్ వంటి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో జాప్యం తగదని, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, డీఈ రాజేందర్, శ్యాంసింగ్, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మానుకోటకు 35వ ర్యాంకు

మహబూబాబాద్ టౌన్, జనవరి 12 : స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో 2022-23 సంవత్సరానికిగాను సౌత్‌జోన్‌లో 50 వేల జనాభా నుంచి లక్ష వరకు కేటగిరిలో మానుకోట మునిసిపాలిటీకి 35వ ర్యాంక్ వచ్చినట్లు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పారిశుధ్యం, ఇతర అంశాలపై కేంద్ర బృందం పర్యటించి, ర్యాంకులను నిర్ణయిస్తారు. దేశ వ్యాప్తంగా 50 వేల నుంచి లక్ష జనాభా కలిగిన కేటగిరిలో 201 మునిసిపాలిటీలుండగా అందులో 2022-23 సంవత్సరానికి గాను మహబూబాబాద్ మునిసిపాలిటీ 35వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

- 30 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు
- సందడిగా మారిన మేడారం పరిసరాలు

మేడారం, జనవరి 12 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం భారీగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు ఆదివాసీ దేవతల మహా జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 30 వేలకు పైగా భక్తులు మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరెసారె, కొబ్బరికాయలు, బెల్లం (బంగారం) సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు.



మేడారంలో వనదేవతల గద్దెలకు పూజలు చేస్తున్న భక్తులు

వైద్య కళాశాలలకు నూతన ప్రిన్సిపాల్స్





భిక్షపతి రావు, రాజేంద్ర ప్రసాద్

హనుమకొండ అర్బన్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను నియమిస్తూ వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ త్రివేణి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది కళాశాలలకు 2024-25 అకడమిక్‌కు ఈ నియామకాలు చేపట్టారు. హనుమకొండ కేఎంసీలోని జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేఎంసీ జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.భిక్షపతిరావును నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

హాస్టల్ గదిలో విద్యార్థిని ఆత్మహత్య

- మృతురాలు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కుమార్తె
- తేలని కారణాలు.. ఎన్నో అనుమానాలు..



రాథోడ్ దీప్తి (ఫైల్)

హసన్‌పర్తి, జనవరి 12: హనుమకొండ జిల్లాలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో రాథోడ్ దీప్తి (20) అనే విద్యార్థిని గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దీప్తి బీఎస్సీ(అగ్రికల్చర్) సెకండ్ ఇయర్ చదువుతోంది. తండ్రి మోతీలాల్ నాయక్ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్నారు.

ఇటీవలే ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. అందులో కొన్ని సబ్జెక్ట్‌ల్లో దీప్తి ఫెయిల్ అయింది. అప్పటినుంచి ఆమె కొంత మనస్తాపంతో వున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో దీప్తి గదిలో ఉండే తోటి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దీప్తి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. దీంతో అనుమానంతో సిబ్బంది తలుపులు తెరిచి చూడగా, ఉరి వేసుకుని కనిపించింది. కళాశాల యాజమాన్యం సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అయితే దీప్తి ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. పరీక్షల్లో ఫెయిల్ కావడం వల్ల అఘాయిత్యానికి ఒడిగట్టిందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనేది సస్పెన్సుగా మారింది. ఈ కోణాల్లోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని దీప్తి తండ్రి మోతీలాల్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి..

దీప్తి ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, కన్నం అనిల్, విజయ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


పోదాం పద జాతర..

ముస్తాబైన ఐనవోలు.. నేడు ధ్వజారోహణం... రేపు భోగి..

8లో..

మహిమల మల్లన్న..

- వైభవంగా జరగనున్న ఉత్సవాలు
- నిర్వహణకు భక్తుల చందాలే దిక్కు
- జాతరలో కనీస వసతుల కరువు



మల్లికార్జునస్వామి విగ్రహం

మచ్చర్లలో నేటి నుంచి మల్లికార్జునస్వామి జాతర



గూడూరు మండలం మచ్చర్ల శివారు గుట్ట ప్రాంతంలో మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సందడి (ఫైల్)

గూడూరు, జనవరి 12 : మండలంలోని మచ్చర్ల శివారు దట్టమైన అటవీప్రాంతం గుట్టపై భాగంలో జరిగే శ్రీమల్లిఖార్జునస్వామి జాతరలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా గుట్టపైకి వేళ్లేందుకు రహదారి లేక నరకయాతన అనుభవిస్తున్నారు. స్వామివారి జాతర అనతికాలంలో ఖ్యాతి గండించినా అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. మల్లన్న జాతర గత 52 ఏళ్ల నుంచి భక్తులు అందజేసే విరాళాలతో అరకొర సౌకర్యాల మధ్య సాగుతుంది. ఈ సారి అదే పరిస్థితి. భక్తులు స్నానాలు చేయడానికి, తాగునీరుకు కటకటే. గత జాతరలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ స్పందించిన జాతరలో సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం, కమనీయం..

మచ్చర్ల శివారు అటవీ ప్రాంతంలో వెలిసిన మల్లికార్జున స్వామి దేవాలయంలో శనివారం నుంచి ప్రారంభం కానుంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు శివసత్తుల ఢమరుక నాదాలతో మార్మోగనుంది. మల్లిఖార్జున స్వామికి దండాలు.. కోరికలు నెరవేరితే కోడేలను కడుతాం.. పంటలు పండుతే పట్నాలు వేస్తాం.. అంటూ జాతరలో సందడి నెలకొననుంది. శివసత్తుల భక్తి పారవశ్య పూనకాలు హోరెత్తనున్నాయి. మల్లన్నస్వామి కల్యాణం ఆద్యంతం ఆసక్తికారంగా జరగనుంది. మొక్కులను తీర్చేందుకు బారుల్లో భక్తులు, ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలు, టెంకాయ బంధనాలు, జాతర భక్తులతో కిక్కిరిసిపోనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతల నుంచి సుమారు లక్ష మందికి పైగా వచ్చి, భక్తులు మొక్కులు చెలిస్తూ స్వామి వారిని దర్శించుకొనున్నారు. ఈ జాతరకు యాదవ కులస్తులు చందాలు వసూలు జాతరను నిర్వహిస్తున్నారు.

ఆ నాలుగు రోజులు ఆద్యంతం ఆసక్తికరం..

ఈనెల 13న శోభయాత్ర, ఊరేగింపుగా అటవీ ప్రాంతంలోని మల్లన్న స్వామి కొలువుదీరిన గుట్టకు చేరుకుంటారు. 14న బోగి.. స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరాది సందర్భంగా మహగణపతి పూజ, పుణ్యహావచనం, అంకురారోపణం, రుద్రాభిషేకం, హోమం, తీర్థప్రసాదముల అనంతరం ఒగ్గు కథాతో కాలక్షేపము, మైలలు తీసే కార్యక్రమని నిర్వహిస్తారు. 15న సంక్రాంతి పర్వదినం రోజున మల్లిఖార్జునస్వామికి పట్నం వేయుట కల్యాణ మహోత్సవంతో పాటు భోనాలు, పట్నం తొక్కుట, దీక్ష విరమణ, తీర్థ ప్రసాదములు, ఎల్లమ్మతల్లి వద్ద కథ, కాలక్షేపము, మైలలు తీయుట కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16న సంక్రాంతి కనుమ రోజున ఎల్లమ్మతల్లికి పట్నము, బోనం, మేకపోతును మత్తుకొలుపుట, బద్దిపోచమ్మతల్లికి బోనం, పట్నం తొక్కుట, ఉత్సహాములు, ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. మల్లన్న జాతరను పిల్లలు కాని మహిళలు సందర్శిస్తే మల్లిఖార్జున స్వామి వరం ఇస్తాడని భక్తుల నమ్మకం. సంతానయోగ్యం కలగని మహిళలు మల్లిఖార్జునస్వామి కల్యాణ మహోత్సవంలో తల స్నానం చేసి ధ్వజస్తంభం ముందు తడిబట్టలతో ప్రదక్షిణలు నిర్వహించి వరం పడుతారు. మల్లిఖార్జున స్వామికి మొక్కులు చెల్లించిన సంవత్సరంలోపే సంతనం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

జాతరలో కనీస సౌకర్యాలు కల్పించాలి



కాడబోయిన నర్సయ్య, జాతర పెద్దగొల్ల,

గూడూరు మండలం మచ్చర్ల మల్లికార్జున స్వామి జాతరలో కనీస సౌకర్యాలు కల్పించాలి. రహదారి, భక్తులకు తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించాలి. అటవీశాఖ అటంకాలను నివారించాలి.




మల్లిఖార్జునస్వామి దేవాలయంలో వెసిన పట్నం (ఫైల్)

ప్రభుత్వం నిధులను కేటాయించాలి

అవుల రాములు, జాతర సారగొల్ల



మచ్చర్ల మల్లికార్జున స్వామి జాతరకు ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో భక్తులు ఇస్తున్న చందాలతోనే గత కొన్నేళ్లుగా జాతరను నిర్వహిస్తున్నాం. జాతరకు చరిత్ర ఘనంగా ఉన్నప్పటికి మౌళిక వసతులకు మాత్రం నోచుకోవడం లేదు. ప్రభుత్వం నిధులు కేటాయించి భక్తులకు మౌళిక వసతులు కల్పించాలి.







విద్యార్థుల సృజనకు పదును

- ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు
- ఈ నెల 18 వరకు ప్రాజెక్టుల అప్‌లోడ్
- హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టుల ఎంపిక



ఇన్‌స్పైర్ మనక్ లోగో

హనుమకొండ రూరల్, జనవరి 12: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే సమయం ఆసన్నమైంది. వారిని ప్రయోగాల వైపు మళ్లించి భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 10 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతోంది. ప్రధానమంత్రి కలల ప్రాజెక్టు స్టార్టప్ ఇండియా దిశగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రయోగాలు, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనల దిశగా 2022-23 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల తయారీ కోసం ప్రతి విద్యార్థికి రూ.10వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టుల ప్రదర్శన ఈసారి ఆన్‌లైన్ వేదికగా నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు

ఆన్‌లైన్ ప్రత్యేక యాప్ ద్వారా ప్రాజెక్టుల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూల్యాంకనం చేసి 26న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రకటిస్తారు. 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు మూల్యాంకనం చేసిన అనంతరం జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే వి ద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్‌లోడ్ ఇలా..

ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థి రిజిస్ట్రేషన్, ఓటీపీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి లాగిన్ కావాల్సి ఉంటుంది. విద్యార్థి పేరు, పాఠశాల పేరు, ప్రాజెక్టు విషయాలు కనిపించగానే వాటిని ఒకసారి సరిచూసుకొని ముందుకు వెళ్లాలి. ఆ తర్వాత అప్‌లోడ్ చేసి ప్రాజెక్టుకు సంబంధించిన వీడియో, ఆడియో, ఫొటోలను నమోదు చేయాలి. వీడియో 2 నిమిషాలు ఉండి 30 ఎంబీ దాటకూడదు. ఫొటోలు నాలుగు వరకే నమోదు చేయాలి. దీంతోపాటు వాయిస్ రికార్డులో ప్రయోగ వివరణ ఇవ్వాలి. వివరాలు అన్నీ సరిచూసుకొని సబ్మిట్ ఎంట్ చేయాలి.

అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్ పోటీలను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రాజెక్టుల అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పోటీల సూచనలను చక్కగా చదువుకొని అర్థం చేసుకొని అప్‌లోడ్ చేయాలి. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. సందేహాల నివృత్తి కోసం 9490112848 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం



అబ్దుల్‌హై, డీఈవో

విద్యార్థులను పాఠశాలల స్థాయిలోనే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టాలి. ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడంవల్ల భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుంది. జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులతో ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేయించడానికి గైడ్ టీచర్లు కృషి చేయాలి.



ఉజ్వల భవిష్యత్‌కు 'నవోదయం'



మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి విద్య

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం
- ఈనెల 20న ప్రవేశ పరీక్ష.. ఏర్పాట్లు పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలు

జఫర్‌గఢ్, జనవరి 12: అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఆధునిక విద్యనందిస్తూ విద్యార్థులను ఉత్తమ విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దుతూ మన్ననలు అందుకుంటోంది ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఇందులో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థికి ఇంటర్ మీడియట్ వరకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యనందిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 20న ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, విద్యార్థులు

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాలో పరీక్ష కేంద్రాలు, ప్రవేశ పరీక్షకు హాజరుకాబోయే అభ్యర్థుల వివరాలను నవోదయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ వెల్లడించారు. జనగామ జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 674 మంది, మహబూబాబాద్ జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 1,162 మంది. ములుగు జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 521 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 238 మంది, వరంగల్ జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 2,082 మంది, హన్మకొండ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాల్లో 837 మంది. సిద్దిపేట జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 124 మంది చొప్పున మొత్తం 26 పరీక్ష కేంద్రాల్లో, 5,638 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

ప్రవేశ పరీక్ష విధానం

ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేటలో ఏర్పాటు చేసిన 26 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. మొత్తం రెండు గంటల వ్యవధిలో 100 మార్కులకు.. మూడు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మేధాశక్తి పరీక్షలో 50 మార్కులతో కూడిన 50 ప్రశ్నలు (60 నిమిషాల సమయం), గణితం విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం), భాషా విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం) చొప్పున ఉంటాయి. ప్రశ్నలకు సమాధానాలు ఐసీఆర్/ఓసీఆర్ షీట్లలో అంకెల రూపంలో గుర్తించాలి. నెగెటివ్ మార్కులు ఉండవు.

18న పరీక్ష నిర్వాహకులకు శిక్షణ

నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 26 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 26 మంది పరిశీలకులు, రూట్ అధికారులకు ఈనెల 18వ తేదీన మామునూరులోని నవోదయ విద్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నారు. పారదర్శక పరీక్ష విధానం, పరిశీలన, పర్యవేక్షణ, నియమ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. పరీక్ష సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించనున్నారు.

అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన అంశాలు

పరీక్షలు రాసేవారందరూ చిన్నారులే కావడంతో ఓసీఆర్ షీట్లలో సమాధానాలు గుర్తించాల్సి ఉండడంతో తడబాటు ఉంటుంది. అది పోవాలంటే కింది అంశాలను గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- సమాధానాలు గుర్తించడానికి నీలి లేదా నలుపు (బ్లూ, బ్లాక్) బాల్ పెన్ను మాత్రమే వినియోగించాలి.
- ఒక్కసారి సమాధానం రాసిన తరువాత మార్చుట, కొట్టివేయుట, దిద్దడం చేయకూడదు.
- ఒక ప్రశ్నకు సుమారు ఒక నిమిషం పడుతుంది. అందువల్ల ఒక్క ప్రశ్న గురించి ఎక్కువ సమయం తీసుకోకూడదు. దానిని వదిలి మరో ప్రశ్నకు జవాబు రాసే ప్రయత్నం చేయాలి. దీని వల్ల సమయం ఆదా తగ్గుతుంది. అన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించాక.. నెగెటివ్ మార్కులు ఉండవు కాబట్టి వదిలివేసిన ప్రశ్నలుంటే అపుడు వాటిని ఆలోచించి సమాధానాలు గుర్తించాలి.
- బుక్‌లెట్‌లో గల మూడు విభాగాల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాల్సిందే. అందువల్ల అవసరానికి మించిన సమయం ఒక్కో విభాగంపై వృథా చేయరాదు.
- ప్రతి 30 నిమిషాలకు ఒకసారి బెల్ కొడతారు. అది గమనించి పరీక్ష రాయాలి.
- పరీక్షకు గంట సమయం ముందే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

బి.పూర్ణిమ, ప్రిన్సిపాల్, మామునూరు నవదోయ విద్యాలయం



ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాల్లో 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఏడు జిల్లాల పరిధిలోని మొత్తం 5,638 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట సమయం ముందే చేరుకోవాలి. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎవరికేని హాల్ టికెట్ అందని పక్షంలో మామునూరు నవోదయ విద్యాలయంలో లేదా హెల్ప్‌లైన్ నంబరు 7780408933కు సంప్రదించాలి.

సీపీని కలిసిన ములుగు ఎస్పీ



సీపీకి పూల మొక్కను అందిస్తున్న ములుగు ఎస్పీ

హనుమకొండ క్రైం, జనవరి 12: ములుగు ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శబరీష్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ములుగు ఎస్పీకి సీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణపై కాసేపు మాట్లాడుకున్నారు.

హేమాచలుడి హుండీ ఆదాయం రూ.7 లక్షలు



హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కిస్తున్న అర్చక, ఉద్యోగులు

మంగపేట, జనవరి 12: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం వద్ద ఎండోమెంట్ పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షణలో గత సెప్టెంబరు 30 నుంచి 2024 జనవరి 11 వరకు భక్తులు వేసిన కానుకలను బందోబస్తు మధ్య లెక్కించారు. మొత్తం ఏడు హుండీల ఆదాయం రూ.7,14,437 ఆదాయంతో పాటు వెండి, కొన్ని రెండు వేల నోట్లు, ఇతర మొక్కులు సమకూరాయని ఈవో శ్రవణపు సత్యనారాయణ, చైర్మన్ నూతల కంటి ముకుందం, ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ఎం.రాజశేఖరశర్మలు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ, వెంకటనారాయణశర్మ, మురళీకృష్ణశర్మ, రాజీవ్ నాగశర్మ, ఉద్యోగులు సీతారాములు, సుధీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్ష

వాజేడు, జనవరి 12: లైంగిక దాడి కేసులో ముద్దాయికి ములుగు జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. 2021లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై వెంకటాపురం మండలం మహితాపురంకు చెందిన గొంది శ్రీకాంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. వాజేడు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అప్పటి సీఐ శివప్రసాద్, ఎస్సై ఎస్.రాము నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పి.లలితశివజ్యోతి సదరు ముద్దాయికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.18వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఈ కేసును అడిషనల్ పీపీ సీహెచ్.సత్యనారాయణ వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.



పర్వతాన్ని అధిరోహిస్తున్న సతీష్

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన యువకుడు

చెన్నారావుపేట, జనవరి 12: ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని ఓ యువకుడు అధిరోహించాడు. మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన ఇల్లా సతీష్ అనే యువకుడు ఆఫ్రికా దేశంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అక్కడే రాక్ క్లయింబింగ్‌ను నేర్చుకున్నాడు. ఈనెల 8న పై 5,895 మీటర్ల ఎత్తున్న కిలీమంజారో పర్వత్వాన్ని నాలుగు రోజులు శ్రమించి ఎక్కాడు. కాగా, ఈవిషయాన్ని శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. ఎంతో సాహసంగా పర్వతాన్ని అధిరోహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గతంలోనూ జంగి జంప్‌లో భాగంగా ప్రయాణిస్తున్న విమానం నుంచి ప్యారాచూట్‌తో జంప్ చేసినట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్టును ఎక్కి బేస్ క్యాంపును అధిరోహించాడు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ

హనుమకొండ రూరల్, జనవరి 12: సమాజంలోని అంతరాలు తొలగిపోవాలంటే విద్యనే సరైన సాధనమని, అందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమకొండలలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బి.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందే కానీ..



మాట్లాడుతున్న రామకృష్ణ

ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యారంగంలో సమూల మార్పుల కోసం ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 'ఉపాధ్యాయ ఉద్యమం మహిళల పాత్ర-సవాళ్లు' అనే అంశంపై అధ్యాపక జ్వాల పత్రిక సంపాదకురాలు జి.కళావతి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడు సమస్యల పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.సుదర్శనం, ఎ.గోవిందరావు, కె.యాకయ్య, సముద్రాల అనిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, ఎం.గంగాధర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాజ్‌కుమార్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగురువేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

నయీంనగర్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు, చిన్నారులకు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయకూడదని, రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు పెట్టవద్దని, ఇంటి దాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర గాలిపటాలు ఎగురవేయకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు దాబాలపై వెళ్లకుండా చూడాలని, వినియోగదారులు ఎప్పటికప్పుడు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంక్రాంతి పండుగను వినియోగదారులందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎండీ వరుణ్‌రెడ్డి కోరారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళి

- కాళోజీ విగ్రహం వద్ద జయంతి, వర్ధంతి



కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ చిత్రం ముందు నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు ఇరువైపు నిలబడ్డ కవి అలిశెట్టి ప్రభాకర్ అని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) హనుమకొండ శాఖ అధ్యక్షుడు సాదు మహేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రజాకవి కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు టి.ఆనందాచారి, వి.రాంబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు. ప్రభాకర్ కవితలను చదివి వినిపించారు.

మార్కెట్‌కు సంక్రాంతి సెలవులు

వరంగల్‌టౌన్, జనవరి 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాలుగురోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారంతపు సెలవు, ఆదివారం భోగి, సాధారణ సెలవు, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను పురస్కరించుకుని సెలవులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో క్రయ విక్రయాలు యథావిధిగా సాగుతాయని వెల్లడించారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

హనుమకొండ అర్బన్, జనవరి 12: వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంజీఎం ఓపీ బ్లాక్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఓపీని ఆర్ఎంవోలతో కలిసి ఆయన సందర్శించారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణ ఓపీ సమయాలే ఈ ఓపీకి వర్తిస్తాయని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి..

ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

కాళోజీ జంక్షన్, జనవరి 12: ఉద్యోగ భద్రత లేని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వేదికగా నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ - టీఎస్ అధ్యక్షుడు రాజేష్‌ఖన్నా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వంగపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కులాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఒక్కో కులానికి ఆర్థికంగా సహాయం చేశాయని అన్నారు. ఒక్కో కులానికి వేర్వేరు కుల వృత్తులు ఉన్నాయని వాటితోపాటు మాదిగలకు కూడా కుల వృత్తి ఉందని అన్నారు. కానీ సమాజంలో ఎంతో ఆధునికత సంతరించి వృత్తికి ఆదరణ లేక పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాదిగలను అక్కున చేర్చుకొని ఆదుకోవాలని ఆయన కోరారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ. 5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ట్యాంక్ బండ్‌పై సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ -టీఎస్ నాయకులు ఇద్దునూరి యాకయ్య, రామంచ సారన్న, చిన్న స్వామి మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు ఆరెపల్లి బాబన్న, దేవరకొండ సదానందం, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు గడ్డం భద్రయ్య రాకేష్, సుధన్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవాల దానం



శ్రీకాంతాచారి (ఫైల్)

గీసుగొండ, జనవరి 12: వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన చెందిన కర్ణకంటి శ్రీకాంతాచారి(27) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా, అతని అవయవాలను తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి దానం చేశారు. కుటుంబీకుల కథనం ప్రకారం.. శ్రీకాంతాచారి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో ఇన్సూరెన్స్ విభాగంలో పనిచేశాడు. ఏడాది కిందట అనారోగ్యానికి గురికాగా, వైద్యపరీక్షలు నిర్వహించగా బ్లడ్ క్లాటింగ్ అవుతున్నట్లు డాక్టర్లు గుర్తించి చికిత్స చేస్తున్నారు. తరుచూ తలనొప్పికి గురవుతుండటంతో కొద్దిరోజుల కిందట శ్రీకాంతాచారి ఇంటికి ఇక్కడే ఉంటున్నాడు. రెండు రోజుల కిందట తలనొప్పితోపాటు మెడభాగంలో నొప్పిరావడంతో అతడిని కేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. బతికున్నప్పుడు శ్రీకాంతాచారి చెప్పిన సూచన మేరకు తల్లిదండ్రులు అతడి అదే ఆస్పత్రి(కేర్)కి అవయవాలను దానం చేశారు. శ్రీకాంతాచారి అంత్యక్రియలు సాయంత్రం గీసుగొండలో నిర్వహించారు. శ్రీకాంతాచారి తల్లిదండ్రులు బ్రహ్మాచారి, సరస్వతి వడ్రంగి పనిచేస్తూ జీవిస్తుండగా, ముగ్గురు అన్నలు ఉన్నారు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేపు కైట్ ఫెస్టివల్

ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహణ

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను ఈనెల 14న సంక్రాంతి పర్వదినం రోజు నిర్వహించాలని నిర్ణయించారు. వాస్తవానికి సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం నిర్వహించాలని ముందుగా అనుకున్నప్పటికీ వీలుకాకపోవడంతో ఆదివారంరోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో జరిగే పతంగుల పండుకను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్న ఈ ఉత్సవంలో పతంగుల ఎగురవేతలో ఆసక్తికలిగిన ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 12: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రాంతంలో శనివారం ఉదయం 8.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా బాలసముద్రంలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్టలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆర్ఈసీ, సోమిడి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిందు కళాకారులకు ప్రోగ్రాంలను కేటాయించాలి



సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గజవెల్లి సారయ్య

వడ్డెపల్లి, జనవరి 12: కళారంగాన్ని జీవనోపాధిగా మలుచుకొన్న చిందు యక్షగాన కళాకారులకు ప్రభుత్వ పథకాలను కేటాయించాలని చిందు యక్షగాన కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గజవెల్లి సారయ్య సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోకొరెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గజవెల్లి సారయ్య మాట్లాడుతూ.. మేడారం జాతరలో చిందు యక్షగాన కళాకారులకు ప్రోగ్రాంలు అప్పజెప్పడంతో పాటు పండుగలు, ఇతర జాతరలలో సైతం కళా ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యపర్చేందు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన వృద్ధ కళాకారులకు నెలకు రూ. 6వేల చొప్పున పెన్షన్ మంజూరు చేయాలని, యువ కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, నివేశన స్థలాలు మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు డీఎస్. జగన్‌ను సైతం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఇంజనీరింగ్ అధికారులతో కడియం భేటీ

నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష

హనుమకొండ టౌన్, జనవరి 12: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి సంబంధించి పంచాయతీరాజ్ విభాగానికి చెందిన అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండ జడ్పీ కార్యాలయంలో పీఆర్ ఎస్ఈ రఘువీరారెడ్డి, ఈఈ శంకరయ్యతో పాటు పలు ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయిన కడియం శ్రీహరి అభివృద్ధి పనులను సమీక్షించారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పీఎంజీఎస్‌వై, సీడీపీ తదితర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కడియం సూచించారు. మంజూరైన పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు.

ఈనెలాఖరుతో స ర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుచున్నందున చేసిన పనులను వెంటనే రి కార్డు చేయాలన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. కాగా, ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారి జడ్పీకి వ చ్చిన కడియంకు ఇంజనీరింగ్ అధికారులు స్వాగతం పలికి సత్కరించారు.



అధికారులతో మాట్లాడుతున్న కడియం

డీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



డీసీసీ బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, జనవరి 12: సహకార బ్యాంకుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలో డీసీసీ బ్యాంకు శాఖ ప్రారంభోత్సవానికి డీసీసీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు అందించే హోమ్ లోన్, పర్సనల్ లోన్, గోల్డ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, వెహికిల్స్ లోన్ తదితర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమర్షియల్ బ్యాంకులతో సమానంగా సేవలందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గండ్ర పద్మ, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్‌రెడ్డి, చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనరసింహారావు, వైస్ ఎంపీపీ అశోక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పొట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టీ నిర్వాహకుడిపై కేసు నమోదు

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 12 : ఇటుక బట్టీలో బాలకార్మికుడితో పని చేయిస్తున్న నిర్వాహకుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి స్టేజీ సమీపంలో ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన గుంజె వెంకటేశ్వర్లు తన ఇటుక బట్టీలో 14 ఏళ్ల బాలుడితో పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో లేబర్ ఆఫీసర్ గట్టిపెల్లి వినోద్‌కుమార్ పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ వివరించారు.

కొత్తకొండలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు

భీమదేవరపల్లి, జనవరి 12: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించాలని అధికారులను అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా ఆదేశించారు. శుక్రవారం దేవాలయంలో శ్రీవీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై ఆర్డీవో రమేష్, ఎంపీడీవో భాస్కర్, ఆలయ ఈవో కిషన్‌రావులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను బట్టీ ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లు, పారిశుధ్య నిర్వాహణ, వైద్యం, విద్యుత్, రవాణా, మంచినీరు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జాతర జరిగే రోజు నుంచి చివరి వరకు తాను అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో జాతర జరుగుతుందని, 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసులు జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జాతరకు వచ్చే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఏవైపు నుంచి రద్దీ ఎక్కువగా ఉంటుందో అక్కడ అధికారుల పర్యవేక్షణ ఎక్కువగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై డీపీవో జగదీష్‌తో అడిషనల్ కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో నాగరాజు, మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చిట్టంపల్లి అయిలయ్య మాడిశెట్టి కుమారస్వామి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జనవరి 12 : జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెట్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట బైపాస్ రోడ్డు, హస్తినాపురం, గోపాలపురంతో పాటు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 16 వరకు మార్కెట్‌కు సెలవు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 12 : మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు శనివారం (నేటి) నుంచి ఈనెల 16వ తేదీ వరకు సెలవులను ప్రకటిస్తున్నట్లు మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న శనివారం, 14న ఆదివారం, వారాంతపు సెలవులు కాగా, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగ సందర్భంగా మార్కెట్ బంద్ ఉంటుందని వివరించారు. రైతులు గమనించి, ఈ సెలవుదినాల్లో సరుకులను తీసుకువచ్చి, ఇబ్బందుల పడవద్దని సూచించారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

డోర్నకల్, జనవరి 12 : ఓ వ్యక్తిపై దాడిచేసి, కులం పేరుతో దూషించిన ఇద్దరిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఝాన్సీ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెంకు చెందిన గుద్దేటి రాము అనే వ్యక్తిపై ఇటీవల అదే గ్రామానికి చెందిన పగడాల సతీష్, అరవింద్ చర్చి మైక్ విషయంలో ఘర్షణ పడ్డారు. దీంతో రాముపై అరవింద్, సతీష్ దాడిచేసి, కులం పేరుతో దూషించారు. ఆపై బాధితుడు రాము పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలపారు.


తొర్రూరులోని బస్టాండ్ సెంటర్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గుమ్ముడూరు ప్రాథమిక పాఠశాలలో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పిస్తున్న రోటరీ క్లబ్ బాధ్యులు


వివేకానంద సెంటర్‌లో వివేకానందుడి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు

ఘనంగా స్వామి వివేకానందుడి జయంతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 12 : జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని ప్రజాసంఘాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం వివేకానందుడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

● జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువతను జాగృతం చేసిన వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకొని, ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని స్థానిక వివేకానంద సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు లక్ష్మణరావు, శ్రీనివాస్, భారత్ వికాస్ పరిషత్ నేతలు బండి నరేందర్‌రెడ్డి, మార్గం శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, జయప్రకాశ్‌లోయా, పున్నం చంద్ మాల్సాని, నాగేందర్, విశ్వనాథం, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● మానుకోట రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొడాలి నాగేందర్ ఆధ్వర్యంలో గుమ్ముడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. వద్దుల సురేందర్‌రెడ్డి, డాక్టర్ జోలి సత్యనారాయణ, పొక్కుల సదానందం, బొల్లం శ్రీనివాస్, కల్లెం వెంకట్‌రెడ్డి, సాదు మహిపాల్‌రెడ్డి, గట్ల శ్రీపాల్‌రెడ్డి, హాల్యానాయక్, నాగముని పాల్గొన్నారు.

● నలంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జోలి సత్యనారాయణ, రోటరీక్లబ్ అధ్యక్షుడు కె.నాగేందర్ వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ప్రిన్సిపాల్ వై.కృష్ణప్రసాద్, కె.ప్రసాద్, కె.బి.శంకర్, కృష్ణారావు, రమేష్, గౌస్‌పాషా, ప్రసాద్, ముత్తయ్య, రవి, రాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు మమత, యుగందర్, వేణుగోపాల్, రాంరెడ్డి, నరహరి, శశికాంత్, హతిరామ్, సుదర్శన్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకొని విద్యార్థులకు ముగ్గులపోటీలు నిర్విహించి, సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.అనిల్, అధ్యాపకులు కవిరాజ్, రామ్మూర్తి, యాకన్న, సతీష్, సుభాష్, స్పందన, లక్ష్మణ్, సైదా, గౌరి శంకర్ పాల్గొన్నారు.

● తొర్రూరు : స్వామి వివేకానంద అని, దేశ కీర్తిప్రతిష్ఠలు, సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టతను ప్రపంచ నలుమూలలా చాటి చెప్పిన మహనీయుడు వివేకానంద అని తొర్రూరు బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ కొనియాడారు. బస్టాండ్ సెంటర్‌లో వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సభ్యులు యాకయ్య, శేఖర్ పాల్గొన్నారు.

● దంతాలపల్లి : మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్దస్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. స్థానికులు చిర్ర సతీష్, హరిప్రసాద్, రామన్న, నవీన్‌కుమార్, నారాయణస్వామి, అనిల్ పాల్గొన్నారు.

●నర్సింహులపేట : స్వామి వివేకానంద జయంతిని నర్సింహులపేటలో నిర్వహించారు. గౌని ఉపేందర్, ప్రభాకర్‌రెడ్డి, మల్సూరు. సుంకరి కృష్ణ, వెంకన్న, యాకయ్య, రామూర్తి ఉన్నారు.

●కేసముద్రం : కేసముద్రంలోని వివేకానందుని విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచకొండ కొమురయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, వోలం శ్రీనివాస్, రామడుగు వెంకటాచారి, వోలం గోవర్ధన్ పాల్గొన్నారు.


టీఎస్-యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న అద్వైత్‌కుమార్ సింగ్

జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలపాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 12 : జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్-యూటీఎఫ్) 2024 నూతన డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వంద శాతం ఉత్తీర్ణత సాధించటంతో పాటు ఎక్కువ మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించే విధంగా చూడాలన్నారు. నాయకులు మల్లారెడ్డి, మురళీకృష్ణ, యాకూబ్, స్వప్న, వెంకటేశ్వర్లు, హుస్సేన్, మంజుల, హరినాయక్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రసాద్, బాలు, కుమార్, నిజామియా, రాంజీ, రాజయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

● జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం పీఆర్టీయూ-టీఎస్ టేబుల్‌క్యాలెండర్‌ను డీఈవో రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంకా బద్రినారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి, నాయకులు కల్లెం వెంకట్‌రెడ్డి, రాంజీనాయక్, మురళీధరస్వామి, రామ్మూర్తి, గీత, సుజాత, సునీత, పూర్ణచందర్, హాల్యానాయక్, శ్యామలాదేవి, శేఖర్, శంకర్, చిట్టిబాబు, రవీందర్, నదీమ్ పాల్గొన్నారు.

● మానుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం 2024-నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు పార్నంది రామయ్య, చాగంటి ప్రభాకర్, పర్వతం తిరుపతి, మద్దెల వీరస్వామి, నాగార్జున, మహేందర్, యాకయ్య, సారయ్య, వెంకన్న, బాలయ్య, లాలునాయక్, దరావత్, భద్రునాయక్, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు

దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించాలి

నెహ్రూసెంటర్, జనవరి 12 : స్కూల్ పిల్లలకు పుట్టుకతో వచ్చే దీర్ఘకాలిక వ్యాదులను గుర్తించాలని డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష వైద్యులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వడ్డెబోయిన శ్రీనివాస్, విజయ్‌కుమార్, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీకొనడంతో యువకుడికి గాయాలు

కేసముద్రం, జనవరి 12 : కేసముద్రం విలేజీలో శుక్రవారం ఆటో, బైక్ ఢీకొనడంతో మండలంలోని భూక్యారాం తండా జీపీకి చెందిన భూక్య రవికి తీవ్ర గాయాలయ్యాయి. కేసముద్రం స్టేషన్ నుంచి భూక్య రవి తన తండా వైపునకు వెళుతుండగా ఎదురుగా మిర్చి లోడుతో ఆటో ఢీకొనడంతో ఎడమకాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉలికిపడిన సిండికేట్ వ్యాపారులు

● పీడీఎస్ బియ్యం దందాపై ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా

నర్సింహులపేట, జనవరి 12 : జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న సిండికేట్ వ్యాపారులు ఉలికిపడ్డారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో జోరుగా 'పీడీఎస్ బియ్యం దందా..' మానుకోట టు కాకినాడ పోర్టుకు తరలింపు, చోద్యం చూస్తున్న అధికారుల అనే కథనం ప్రచురితం కావడంతో అక్రమ వ్యాపారులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. బియ్యం దందాపై జిల్లా ఇంటెలిజెన్స్, సివిల్‌సప్లై, పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో ఎస్ఎఫ్‌సీ కార్డుదారుల నుంచి ఎవరు ఎంతకు కొంటున్నారు. సిండికేట్ వ్యాపారులు ఎవరు అనే కోణంలో దృష్టి సారించినట్లు తెలుస్తున్నది. త్వరలో పీడీఎస్ బియ్యం అక్రమ దందాపై కొరడా ఝులిపించనున్నట్లు సమాచారం.

రైస్ మిల్లులపై సివిల్‌సప్లై అధికారుల దాడులు

● రెండు మిల్లులపై కేసు నమోదు, మరో మిల్లుకు పంచనామా

● కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు ● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్..

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 12 : కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బకాయిలు పడ్డ రైస్‌మిల్లర్లపై కొరడా ఝులిపించారు. దాని ఫలితంగా కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ రైస్) ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం వహించిన కేసముద్రం మండలంలోని రెండు రైస్‌మిల్లులపై కేసు నమోదు చేయగా, పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి మిల్లుకు పంచనామా నిర్వహించారు. నేడు.. రేపో కేసులు నమోదు అయ్యే అవకాశం ఉంది. గత డిసెంబర్ 26న ఆంధ్రజ్యోతిలో 'కస్టం వసూలయ్యేనా... సీఎంఆర్ బియ్యం రికవరీ జరిగేనా..?' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. గురువారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్ల సమావేశం ఏర్పాటు చేసిన కలెక్టర్ సీఎంఆర్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న రైస్‌మిల్లులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లాలోని రైస్‌మిల్లుల్లో తనిఖీ చేసి, బియ్యం రివకరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో డీఎస్‌వో రాజేందర్ ఆధ్వర్యంలో కేసముద్రం మండలంలోని పలు మిల్లులపై గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. తాము సరఫరా చేసిన ధాన్యం ఆయా మిల్లుల్లో తేడాలు ఉన్నాయని, కొంతధాన్యం మాయమైందని అధికారుల విచారణలో తేలింది. దాంతో డీఎస్‌వో ఆధ్వర్యంలో డీటీ ఇద్దరు కలిసి పంచనామా నిర్వహించి, సివిల్ సప్లై మేనేజర్ కృష్ణవేణికి నివేదిక అందించారు. దీంతో మేనేజర్ రాత్రి సమయంలో కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని శ్రీనివాస్ రైస్ ఇండస్ట్రీస్, సాయిరాఘవ ఇండస్ట్రీస్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం మిల్లులపై కేసు నమోదైంది. అయితే మరికొన్నిమిల్లుల్లో తనిఖీలు చేసినప్పటికి వాటిపై చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. కాగా, పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి ఉమామహేశ్వరి రైస్‌మిల్లులో తనిఖీలు చేపట్టగా, ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యంలో తగ్గుదల ఉందని డీఎస్‌వో పంచనామా చేసి జిల్లా మేనేజర్‌కు నివేదిక అందించారు. భారీ మొత్తం బకాయిలు ఉన్న రైస్‌మిల్లర్లను వదిలేసి నామమాత్రంగా ఉన్న రైస్‌మిల్లులపై దాడిచేసి కేసులు నమోదు చేయడం పట్ల రైస్‌మిల్లర్లే విమర్శిస్తున్నారు. అయితే అధికారులు పాత బకాయిలు వసూలు పూర్తిగా చేపడుతారా.? లేక మధ్యలోనే వదిలేస్తారా అనేది వేచి చూడాల్సిందే!


పెద్దవంగర మండలంలోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న డీఎస్‌వో రాజేందర్

జాతరకు రూ.5 లక్షల నిధుల మంజూరు

గూడూరు, జనవరి 12 : బొల్లెపల్లి-ఏపూరు గ్రామాల మధ్యలో ఉన్న గబ్బిలాలమడుగు సమ్మక్క-సారలమ్మ జాతర రోడ్డు మరమ్మతుల కోసం రూ.5 లక్షలను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శుక్రవారం మంజూరు చేశారు. ఈ నిధులతో బొల్లెపల్లి నుంచి జాతరలో జరిగే వన దేవతల గద్దెల వరకు రోడ్డు నిర్మించనున్నారు. ఈ మేరకు సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వాహకులు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతర కమిటీ అధ్యక్షుడు అర్రెం వీరస్వామి, పూజారి కమిటీ అధ్యక్షుడు కొట్టెం కృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, గట్టుమల్లు, భూపాల్, రమేష్, భద్రయ్య, చంద్రయ్య, అశోక్, వీరస్వామి, నాగయ్య గోపాల్, లక్ష్మి, శ్రీను, చంద్రు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దంతాలపల్లి, జనవరి 12 : మండలంలోని రేపోణి, గున్నేపల్లి గ్రామాల్లో శుక్రవారం తొర్రూర్రు ఎక్సైజ్ పోలీసులు గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాడుల్లో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని రేపోణికి చెందిన రాధమ్మ, గున్నేపల్లికి చెందిన శశిరేఖపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. గుడుంబా తయారీ చేసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

● సీఎంకు గొడుగు శ్రీనివాస్ విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జనవరి 12 : రాష్ట్రంలో ముదిరాజు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వారిని ఆదుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. గత ఆగస్టులో కురిసిన అకాల వర్షాలకు మత్స్యసంపదను కోల్పోయి నష్టపోయిన మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

నేడు ఉప్పరపల్లిలో కబడ్డీ పోటీలు

కేసముద్రం, జనవరి 12 : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో శనివారం మండల సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కరోజు నిర్వహించే ఈ పోటీల్లో ఉప్పరపల్లి, అర్పనపల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు.

ధ్యానంతోనే ప్రశాంతత

● సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి

తొర్రూరు, జనవరి 12 : ధ్యానంతోనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని, సకల రోగ నివారణకు ధ్యానం పరమ ఔషధమని అని సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ నాగవాణి అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యువజన దినోత్సవ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, సంప్రదాయ వస్త్ర అలంకరణ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ ముగ్గులు మహిళల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, చలువాది సత్యనారాయణ, వజినపల్లి దీప అనిల్, శైలజ, మాధవి, రవి, యాకయ్య, రమణారెడ్డి, వాణి పాల్గొన్నారు.

న్యూ నెహ్రూస్ట్రీట్‌లో నీటికి కటకట

డోర్నకల్, జనవరి 12 : మునిసిపల్ పరిధిలోని న్యూనెహ్రూస్ట్రీట్‌లో గత 15 రోజులుగా కులాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సదరు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని అందించే మోటార్ పనిచేయకపోవడంతో నీరు రావడం లేదని, ఈ విషయాన్ని మునిసిపల్ అధికారులకు, స్థానిక కౌన్సిలర్‌కు చెప్పినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల వద్ద నుంచి పన్నులు వసూలు చేస్తున్న మునిసిపల్ మునిసిపల్ పాలకవర్గం ప్రజల బాధను పట్టించుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిలదీశారు. శనివారం వరకు సమస్యను పరిష్కరించకపోతే మునిసిపల్ కార్యాలయంను ముట్టడిస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.

'మండల కాంగ్రెస్ అధ్యక్షుడిని మార్చాలి'

బయ్యారం, జనవరి 12 : గ్రూపు రాజకీయాలకు తెరలేపుతూ మండలంలో కాంగ్రెస్‌ను భ్రష్టుపట్టిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్యను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా వైస్‌చైర్మన్ బానోత్ రామునాయక్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు కొండపల్లి వీరలక్ష్మీ కోరారు. బయ్యారంలో శుక్రవారం ఓ వర్గం కాంగ్రెస్ నేతలు విలేకర్లతో మాట్లాడారు. గురువారం ముసలయ్య విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధంలేదని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంత కాలం పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తూ బీఆర్ఎస్‌తో అంతర్గతంగా మిలాకతై బయ్యారం మండలంలో కాంగ్రెస్ నిర్వీర్యమైయ్యేలా ముసలయ్య చేపట్టిన చర్యలను హైకామండ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యుడు బానోత్ మోహన్‌జీ, ఎంపీటీసీ సభ్యురాళ్లు భూక్య కక్కీ, తిరుమల శైలజారెడ్డి, సర్పంచులు బానోత్ నీలమ్మ, లక్ష్మీ, రాజు, పద్మ, కిరణ్, పీఏసీఎస్ డైరెక్టర్లు తిరుమల ప్రభాకర్‌రెడ్డి, చాగర్లమూడి భాస్కర్ రావు, వేల్పుల శ్రీనివాస్, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఉప్పలయ్య క్రిష్ణ, మంగీలాల్, వెంకన్న, నాగేందర్, సుధాకర్, అరుణ్, పార్వతీ, సురేష్ పాల్గొన్నారు.

గోదాదేవికి ఘనంగా కుడారై ఉత్సవాలు

మరిపెడ, జనవరి 12 : ధనుర్మాసంలో భాగంగా మరిపెడలోని రామాలయంలో శుక్రవారం గోదాదేవి-రంగనాథులకు ఆలయ నిర్వాహకులు, భక్తులు ఘనంగా కుడారై ఉత్సవాలను జరిపారు. దేవతమూర్తుల ఉత్సవవిగ్రహాలను పల్లకి సేవలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి మంగళహారతులు ఇచ్చారు. అర్చకుడు వెంకటశ్రీమన్నారాయణచార్యులు ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● మునిసిపల్ సమీక్షలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 12 : మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని మునిసిపల్ కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలో గత ప్రభుత్వం రూ.60కోట్ల పనులు మంజూరు చేసిందని, అవికాకుండా రూ.25కోట్ల పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మిషన్ భగీరథ భవనంలో ట్రైబల్ వెల్ఫేర్, హౌజింగ్, మైనింగ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖలపై సమీక్ష చేపట్టారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో రివ్యూ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ సరస్వతి, అధికారులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి..

దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాల కృషి చేస్తుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. తొర్రూరులోని పాటిమీదగల అయ్యప్ప ఆలయంలో చేపట్టిన ఇరుముడి కార్యక్రమం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామి నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డిలను ఘనంగా సత్కరించారు. విశ్వప్రకాశచార్యులు, విక్రమ్‌శర్మ, కె.నాగేంద్రచారి, పూర్ణచారి, చంద్రశేఖరాచారి, వెంకటాచారి, సోమ రాజశేఖర్, సంతోష్, బాపురెడ్డి, కృపాకర్ రాజు, కుషాల్, నిరంజన్ రెడ్డి, పెదగాని సోమయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోదాం పద జాతర..

ముస్తాబైన ఐనవోలు

» నేడు ధ్వజారోహణం... రేపు భోగి..

» మల్లన్న చెంతకు పోటెత్తనున్న భక్తులు


మల్లికార్జునస్వామి దేవస్థానం భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఐనవోలు, జనవరి 12 : ఐనవోలు జాతరకు ముస్తాబైంది. ఈ నెల 13న శనివారం ధ్వజారోహణతో జాతర ఉత్సవాలు ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుండటం ఈ ఆలయ విశిష్టత. 14న భోగి, 15 మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు జాతర నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపి సౌకర్యాలు కల్పించారు. ఎట్టకేలకు జాతరలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. భక్తులు స్నానాలు చేసేందుకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను 6చోట్ల ఏర్పాటు చేశారు. మహిళలు స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు 7 చోట్ల డ్రెసింగ్ రూంలను ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో ఉన్న మూడుచోట్ల మరుగుదొడ్లను సులభ్ కాంప్లెక్స్‌కు అప్పగించారు. జాతరలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. జీడబ్ల్యూఎంసీ, పంచాయతీరాజ్ శాఖ దేవస్థానం నుంచి 300మంది కార్మికులు పారిశుధ్య నిర్వహణను చేపట్టనున్నారు.

పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్..

పోలీసులు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. జాతర పార్కింగ్ స్థలాలను ఖరారు చేసి రూట్‌మ్యాప్‌ను విడుదల చేశారు. 10 చెక్‌పోస్టులు, 150 సీసీ కెమెరాలు, ప్రత్యేక గస్తీ, నిఘా బృందం, షీటీంలు పనిచేయనున్నాయి. డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో సుమారు 400 పైచిలుకు మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక బస్సులు..

హనుమకొండ డిపోకు చెందిన సుమారు 130 బస్సుల ద్వారా జాతరకు భక్తులను చేర్చనున్నారు. వరంగల్ నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ఐనవోలుకు బయలుదేరుతుంది. ఐనవోలు- కాజీపేట- కొమురవెల్లి- వేములవాడలకు భక్తులు వెళ్లేవిధంగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు.

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రియాంకగాంధీ జన్మదిన కేక్‌ను మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమా కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. నాయకులు పద్మం ప్రవీణ్, అల్లం నాగేశ్వర్‌రావు, నరేష్‌రెడ్డి, కమలేందర్, నాసర్, రాజేష్‌నాయక్, నరేష్‌నాయక్, పవన్, రాకేష్, శ్యాం, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

'నిరుపేదలందరికి సంక్షేమ పథకాలందాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 12 : నిరుపేదలందరికి సంక్షేమ పథకాలందాలన్నదే కాంగ్రెస ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ మునిసిపాలిటీ, రూరల్ మండలానికి చెందిన 34 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్, కాంగ్రెస్ మునిసిపల్‌ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు పోతురాజు రాజు, దండెబోయిన బుజ్జివెంకన్న, కోడి శ్రీను, నాయకులు చుక్కల ఉదయ్‌చందర్, మిట్టకంటి రాంరెడ్డి నీరుటి సురేష్, ఎడ్ల రమేష్ పాల్గొన్నారు.